# కమలానికి పల్లపు రాజీనామా

### నేడు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిక



సిటీబ్యూరో, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : బీజేపీలో రాజీనామాల పర్వం కొనసాగుతున్నది. నిన్న కూకట్‌పల్లి కమలం నాయకులు రాజీనామా చేయగా.. తాజాగా ఖైరతాబాద్ టికెట్ ఆశించి భంగపడిన పల్లపు గోవర్ధన్ పార్టీకి రాజీనామా చేశారు. అయితే వడ్డెర సామాజిక వర్గానికి చెందిన బలమైన బీసీ నేత గోవర్ధన్‌ను బీఆర్ఎస్‌లోకి రావాలని మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఆహ్వానించారు. శుక్రవారం భారీ ర్యాలీతో తెలంగాణ భవన్‌లో మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరనున్నట్లు గోవర్ధన్ ప్రకటించారు. ఆర్ఎస్ఎస్, బీజేపీతో 22 ఏండ్ల అనుబంధం ఉన్నదని పార్టీ మారినా.. హిందుత్వం, ధర్మం కోసం సంఘ్ స్ఫూర్తితో పనిచేస్తానని తెలిపారు. ఎన్నికల్లో నాలుగైదు సీట్లు గెలిచేందుకే బీజేపీ బీసీ ముఖ్యమంత్రి నినాదంతో బలహీన వర్గాలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. పార్టీకోసం సర్వం దారపోసిన తనను పార్టీ అవమానించిందని ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. గోవర్ధన్ వెంట యువజన సంఘాలు, వడ్డెర, ఉప్పెర ఇతర బీసీ నేతలు గులాబీ కండువా కప్పుకోనున్నారు. దీంతో ఖైరతాబాద్ నియోజకవర్గంలో బీజేపీ ఖాళీ కానున్నది.



మంత్రి హరీశ్‌రావు సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరుతున్న ముద్దగౌని

# కాంగ్రెస్‌కు ముద్దగౌని ఝలక్

### టికెట్ కేటాయించక పోవడంతో సొంత గూటికి

### ఇద్దరు ముగ్గురు నాయకులతోనే ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి

### ముఖం చాటేస్తున్న టికెట్ ఆశించిన నేతలు

### ప్రచారంలో దూసుకుపోతున్న బీఆర్ఎస్ అభ్యర్థి సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 2 : ఎల్బీనగర్ నియోకవర్గంలో అధికార బీఆర్ఎస్ పార్టీని దీటుగా ఎదుర్కొని విజయం సాధిస్తామంటూ పేర్కొంటున్న కాంగ్రెస్ పార్టీకి బిగ్ షాక్ తగిలింది. కాంగ్రెస్‌కు కొండత బలం అవుతాడని భావించి ఎల్బీనగర్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జి ముద్దగౌని రామ్మోహన్ గౌడ్‌ను ఆ పార్టీలో చేరుకున్న పదిహేను రోజులకే తిరిగి సొంత గూటికి చేరారు. దీంతో కాంగ్రెస్ పార్టీ శ్రేణులతో పాటు నాయకులు ఒక్కసారిగా అవాక్కయ్యారు. ఎల్బీనగర్ నియోజకవర్గంలోని పదకొండు డివిజన్లలో కాంగ్రెస్ పార్టీ క్యాడర్ అంతంత మాత్రమేన. అయితే టికెట్ ఆశించి కాంగ్రెస్‌లో చేరిన ముద్దగౌని రామ్మోహన్ గౌడ్, మాజీ కార్పొరేటర్ లక్ష్మీప్రసన్న దంపతులకు నియోజకవర్గం వ్యాప్తంగా సొంత క్యాడర్, వర్గం ఉన్న నేపథ్యంలో ఈ బలం తమ పార్టీ గెలుపునకు దోహదం అవుతుందని కాంగ్రెస్ శ్రేణులు భావించాయి. అయితే కాంగ్రెస్ పార్టీ టికెట్ ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేసిందని పేర్కొంటూ రామ్మోహన్ గౌడ్ దంపతులు తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుకోవడంతో పాటుగా ఎల్బీనగర్ నియోకవర్గంలో బీఆర్ఎస్ అభ్యర్థి దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి గెలుపు కోసం పనిచేస్తానంటూ ప్రకటించడంతో కాంగ్రెస్ పార్టీ దిక్కుతోచని స్థితిలో పడిపోయింది. బీఆర్ఎస్ పార్టీ ట్రబుల్ షూటర్ హరీశ్ రావు ముద్దగౌని రామ్మోహన్ గౌడ్ నివాసానికి చేరుకొని వారిని బుజ్జగించడంతో పాటుగా బీఆర్ఎస్‌లో వారికి సరైన ప్రాతినిధ్యం కల్పిస్తామని, పార్టీ నాయకులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇవ్వడంతో అందరూ బీఆర్ఎస్‌లో చేరిపోయారు.

#### కాంగ్రెస్ అభ్యర్థి ప్రచారం చేస్తున్నా

ఎల్బీనగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మధుయాష్కీ గౌడ్ ఎన్నికల ప్రచారం చేస్తున్నా ఆయన వెంట ప్రధాన నాయకులు ఇద్దరు ముగ్గురు మినహాయిస్తే పార్టీ శ్రేణుల నుంచి పూర్తి సహకారం లభించడం లేదని తెలుస్తున్నది. ప్రధానంగా ఎల్బీనగర్ టికెట్ ఆశించిన నాయకులంతా మధుయాష్కీ గౌడ్ ప్రచార కార్యక్రమంలో ముఖం చాటేస్తున్నారు. ప్రధానంగా తామే అభ్యర్థులమంటూ నియోజకవర్గంలో చక్కర్లు కొట్టిన మల్‌రెడ్డి రాంరెడ్డి, మిద్దెల జితేందర్, సుదిని మహేందర్ లాంటి నాయకులు అసలు కనపడటం లేదు. కేవలం బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిపై వ్యక్తిగత అరోపణలు, దూషణలకే ప్రాధాన్యత ఇస్తూ ప్రచారం చేస్తున్నారు. అంతేకాక పదకొండు డివిజన్లలో పార్టీ క్యాడర్ పూర్తి స్థాయిలో లేకపోవడం కూడా వారి ప్రచారంలో వేగం పెంచకపోవడానికి కారణమని కొందరు నేతలు పేర్కొన్నారు.



ఉప్పల్ బూత్ కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

# ఇంటింటికీ బీఆర్ఎస్

## ప్రతి వంద ఓటర్లకు ఒక సభ్యుడు

### రూ.2 వేల కోట్లతో ఉప్పల్ అభివృద్ధి

### బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

### ఉప్పల్ బూత్ కమిటీ సభ్యుల సమావేశం

సిటీబ్యూరో, నవంబర్ 2(నమస్తే తెలంగాణ)/ మల్లాపూర్ : తొమ్మిదిన్నర ఏండ్ల పాలనలో తెలంగాణ రాష్ట్రంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి, సంక్షేమ పథకాలతో పాటు రాష్ట్రంలో ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా విద్యుత్, మంచినీరు ఇలా అనేక సమస్యలను తీర్చి రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నారని మున్సిపల్, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ అన్నారు. గురువారం మల్లాపూర్ వీఎన్ఆర్ గార్డెన్‌లో ఉప్పల్ నియోజకవర్గం బీఆర్ఎస్ ఎన్నికల ఇన్‌చార్జి రావుల శ్రీధర్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన నియోజకవర్గం బూత్ కమిటీల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సభా వేదికపై ఇరువైపులా ప్రొజెక్టర్లు ఏర్పాటు చేసి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ మీ ఉత్సాహం, ఊపు చూస్తుంటే.. ఉప్పల్‌లో ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించుకుంటారన్నారు.

#### ప్రతి బూత్ సభ్యుడు వంద మంది ఓటర్లను కలవాలి

బీఆర్ఎస్ ప్రభుత్వం తొమ్మిదన్నర ఏండ్లలో చేసిన అభివృద్ధి, సకాలంలో అందుతున్న సంక్షేమ పథకాలు, తిరిగి తమ పార్టీ అధికారంలోకి వస్తే ప్రజల అభివృద్ధి కోసం ఏం చేస్తుందనేది విస్తృత స్థాయిలో ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి కేటీఆర్ సూచించారు. తొమ్మిదన్నర ఏండ్లలో ఏం చేశాం.. తిరిగి మూడో సారి అధికారంలోకి వస్తే ఏం చేయబోతున్నాం అనే అంశాలపై బూత్ కమిటీ సభ్యులు ఇంటింటికి పోయి ప్రచారం చేయాలని పిలుపునిచ్చారు. ప్రతి బూత్ సభ్యుడు వంద మంది ఓటర్లు.. అంటే కేవలం 25 ఇండ్లకు పోయి ప్రచారం చేయాలన్నారు. ఎట్టి పరిస్థితిలో బీఆర్ఎస్ పార్టీని భారీ మెజారిటీతో గెలుపించుకోవడం కోసం కార్యకర్తలు, బూత్ సభ్యులంతా పని చేయాలన్నారు.

#### ఉప్పల్‌లో 2వేల కోట్లతో అభివృద్ధి

ఉప్పల్ నియోజకవర్గంలో రెండు వేల కోట్లతో అభివృద్ధి జరిగిందని మంత్రి కేటీఆర్ తెలిపారు. గత పాలకుల హాయంలో ఎలాంటి అభివృద్ధి జరగలేదని.., తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన తొమ్మిదన్నర ఏండ్ల పాలనలో ఉప్పల్ చౌరస్తాలో స్కైవే, రోడ్ల విస్తరణ, శిల్పారామంతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు చెప్పారు.

> అలనాటి అసమర్థ, చేతకాని కాంగ్రెస్ పాలన వల్ల ఉప్పల్ నియోజకవర్గంలో అభివృద్ధి కుంటుపడిందని మంత్రి, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఎద్దేవ చేశారు. ప్రస్తుతం మేడ్చల్ ఎంపీగా ఉన్న రేవంత్‌రెడ్డి ఉప్పల్ నియోజకవర్గం అభివృద్ధి కోసం చేసింది శూన్యమన్నారు. ఎంపీగా ఎన్నడూ ఈ నియోజకవర్గంలో పర్యటించింది లేదని, ఇక్కడి ప్రజలను ఎప్పడూ పట్టించుకున్న పాపాన పోలేదని విమర్శించారు. ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికి.. ఇప్పుడు ఓట్లు ఏ విధంగా అడుగుతారని దుయ్యబట్టారు. తెలంగాణ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు రూ.2000 కోట్లతో ఉప్పల్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిందని తెలిపారు. మెట్రో రైలు, స్కైవాక్, శిల్పారామం, ఐటీ పార్కుల ఏర్పాటుతో పాటు పారిశ్రామిక వాడలు, రోడ్ల వెడల్పు, పరిశ్రమలకు కావాల్సినంత కరెంట్ సౌకర్యం.. ఈ విధంగా చెప్పకుంటూ పోతే ఎంతో అభివృద్ధి చేసినట్లు చెప్పారు.

#### మల్కాజిగిరి ఎంపీగా ఏం చేశావ్.?

కాంగ్రెస్ వాళ్లు ఒక్క చాన్స్ ఇవ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తామని అంటున్నారని, 50 ఏండ్లు పాలించి అప్పుడు ఏం చేశారని మంత్రి కేటీఆర్ ప్రశ్నించారు. అప్పుడు చేయని అభివృద్ధి.. ఇప్పుడు చేసి చూపిస్తామంటే ప్రజలు నమ్ముతారా.. అని అన్నారు. మల్కాజిగిరి ఎంపీగా గెలిచిన మాటల గారడి రేవంత్‌రెడ్డి.. ఇంత వరకు ఎక్కడ అభివృద్ధి చేయలేదని, పార్లమెంట్‌లో ఎన్నడూ మల్కాజిగిరి పార్లమెంట్ గురించి నోరు ఎత్త లేదని చెప్పారు. అలాంటి నిన్ను ప్రజలు ఎలా గెలిపిస్తారనుకుంటున్నావని ప్రశ్నించారు.

#### ఈసీఐఎల్ వరకు మెట్రో రైలు విస్తరణ

ఉప్పల్ నియోజకవర్గంలో సీసీఎంబీ, ఐఐసీటీ, పారిశ్రామిక వాడలు, నాచారంలో చెప్పులు తయారు చేసే పరిశ్రమలు ఎన్నో ఉన్నాయని, దీంతో దేశంలోని అన్ని రాష్ట్రాల నుంచి వచ్చిన ప్రజలు ఇక్కడ స్థిరపడ్డారని మంత్రి కేటీఆర్ అన్నారు. ఇదొక మినీ ఇండియా అని ఉప్పల్ నియోజకవర్గం గురించి అభివర్ణించారు. అక్కడ మత సామరస్యం వెల్లివిరుస్తుందన్నారు. ఎలాంటి తగాదాలు, గొడవలు లేకుండా అన్ని రాష్ట్రాలకు చెందిన ప్రజలు, హిందూ, ముస్లింలు అన్నాదమ్ముల్లా కలిసిమెలిసి ఉన్నారన్నారు. హైదరాబాద్‌లో కరెంటు సమస్యకు ఉపశమనం కల్పించడంతో పాటు రోజుకు 24 గంటల కరెంటు ఇచ్చే పరిస్థితిని తీసుకువచ్చినట్లు మంత్రి కేటీఆర్ తెలిపారు. ఈసీఐఎల్ వరకు మెట్రో రైలు విస్తరణ కోసం ప్రణాళికలు సిద్ధమవుతున్నాయన్నారు.

#### ఎన్నికల్లో ఈ 25 రోజులు కీలకం..

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ 25 రోజులు చాలా కీలకమని, బూత్ కమిటీ సభ్యులంతా ఇంటింటికి వెళ్లి బీఆర్ఎస్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి గురించి ప్రచారం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉన్నదని మంత్రి కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ ఎన్నికల్లో గెలువడానికి ఈ 25 రోజులు కష్టపడి పని చేస్తే.. గెలిచిన తర్వాత ఐదేండ్లు ఉప్పల్ అభివృద్ధి, ఇక్కడ ప్రజల సంక్షేమం కోసం ఉప్పల్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఐదేండ్లు పని చేస్తారన్నారు. పార్టీ అధికారంలోకి రావడం కోసం ప్రతి వంద మంది ఓటర్లకు ఒక ఇన్‌చార్జి ఏర్పాటు చేయడంతో పాటు.. ఈ నియోజకవర్గంలో ఉన్న 407 పోలింగ్ బూత్‌లలో 4980 మంది ఇన్‌చార్జిలను నియమించడం చాలా సంతోషకరమన్నారు. ఉప్పల్‌లో ఐదు లక్షలకు పైగా ఓటర్లు ఉన్నారని, ఈ నియోజకవర్గం బీఆర్ఎస్ తరుపున పోటీలో ఉన్న బండారి గెలుపు కోసం ఇంత మంది కార్యకర్తలు ఎంతో ఉత్సాహంగా పని చేయడం కోసం సిద్ధంగా ఉండడం అభినందనీయమన్నారు. ఇదే ఊపుతో నగరంలోని అన్ని నియోజక వర్గాలలో కూడా బీఆర్ఎస్ పార్టీ గెలిచే విధంగా కృషి చేయాలని కార్యకర్తలను ఉద్దేశించి అన్నారు.

#### ఐకమత్యంతో ఉండి.. క్రమ శిక్షణతో గెలిపించండి.. ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి

ముఖ్యమంత్రి కేసీఆర్ తనకు ఎమ్మెల్యే టికెట్ నమ్మకంతో ఇచ్చారని, మీరందరూ ఐకమత్యంతో ఉండి క్రమ శిక్షణతో పనిచేసి తనను గెలిపించే విధంగా ఈ 25 రోజులు శ్రమించండి.. నేను 5 సంవత్సరాలు మీకు సేవ చేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ మాజీ చైర్మన్ తాడూరి శ్రీనివాస్, రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు పార్టీ అనుబంధ సంస్థల నాయకులు, బీఆర్ఎస్ మహిళా సోదరీమణులు, 5వేల మంది బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉప్పల్ బూత్ కమిటీ సమావేశానికి హాజరైన కార్యకర్తలు